క్లుప్తంగా

వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని రామాపురంలో సోమవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ మేకల రమ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కోరారు. క్వింటాల్‌కు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిరంజన్ రావు, మాజీ జెడ్పీటీసీ హనుమంత్ నాయక్, కుడికిల్ల సింగిల్ విండో డైరెక్టర్ రఘుపతిరావు, మాజీ సర్పంచ్ బాల్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

‘చినుకు పూల’ పుస్తకావిష్కరణ



కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరు గ్రామ ఉన్నత పాఠశాలలో సోమవారం డాక్టర్ గూడెల్లి శ్రీను రచించిన ‘చినుకు పూల’ పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదివి తెలుగుభాషపై నైపుణ్యం పెంచుకోవాలన్నారు. అనంతరం రచయితను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు.

ప్రభుత్వ ప్రకటనపై దివ్యాంగులు హర్షం

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని డిసెంబర్ 3న ప్రభుత్వమే నిర్వహిస్తుందని ప్రకటించడంతో దివ్యాంగ హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సాయిగార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలపడంతో సంతోషం వ్యక్తం చేశారు. గత నెల 21న జిల్లా కేంద్రంలోని బాలుర పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో దివ్యాంగులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తారని వికలాంగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విజయవంతం చేయాలి

మన్ననూర్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సాయిగార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించే ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఇండియా అధ్యక్షుడు రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కలెక్టర్ బదావత్ సంతోష్ హాజరవుతారని తెలిపారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి



కల్వకుర్తిరూరల్: పీహెచ్‌సీ పరిధిలో ఉన్న కుష్టు వ్యాధిగ్రస్తులను 15వ తేదీలోగా గుర్తించి వివరాలు నమోదు చేయాలని వైద్యాధికారి రజిత సూచించారు. సోమవారం రఘుపతిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి రోజు 20 గృహాలను సందర్శించాలని కోరారు. కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ నెల 8వ తేదీ వరకు వరల్డ్ పొజిషన్ అబ్జర్వేషన్ వీక్ ర్యాలీలో అవగాహన కార్యక్రమం నిర్వహించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో వెంకటేష్, ప్రమోద్‌కుమార్, పుష్ప, యశోద, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్గీకరణ అమలు చేయాలి

చారకొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ తెలంగాణ దక్షిణ జిల్లాల అధ్యక్షుడు చింతాబాబు మాదిగ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి చింతబాబు మాదిగ హాజరై మాట్లాడారు. వర్గీకరణపై సుప్రీకోర్టు తీర్పు ఇచ్చినా రాష్ట్రంలో అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం వైఖరికి నిరసనగా 19 హైదరాబాద్‌లోని మాదిగల మహగర్జన నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. మాదిగలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. వాసవీక్లబ్ క్యాలెండర్ ఈవెంట్స్ ఇన్‌చార్జ్ రాఘవేందర్ సతీమణి లక్ష్మి జన్మదినం సందర్భంగా కల్వకుర్తి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లను సమకూర్చారు. శ్రీనివాస్, బాదం రాఘవేందర్, నీల కోటేశ్వర్, మాచిరెడ్డి, రవికుమార్, హెచ్‌ఎం శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ను తరిమేద్దాం


తిమ్మాజిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



అచ్చంపేటలో ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తారాసింగ్

అచ్చంపేట రూరల్: ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ తారాసింగ్ తెలిపారు. వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా సోమవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ అచ్చంపేట ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ హన్మంతు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటేష్, నర్సింహారావు, నరేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రతిఒక్కరికి ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి సబిత అన్నారు. జిల్లా కేంద్రంలోని మదర్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ డే నిర్వహించారు ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ హెచ్‌ఐవీ ఉన్నవారిని చిన్నచూపు చూడొద్దన్నారు. అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై ప్రజలకు అవగాహన

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మాచారంలో సోమవారం మాచారం పల్లెదవాఖాన వైద్యాధికారి భవితేజ హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. రక్తమార్పిడీ, సిరంజి, శారీరక సంబంధాలతో హెచ్‌ఐవీ సోకుతుందని తెలిపారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు జ్యోతి, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మండల వైద్యాధికారి డాక్టర్ కల్పన ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాధి ఎలా సంక్రమిస్తుంది.. వ్యాధి రాకుండ ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అనసూయ, డాక్టర్ ఇస్మాయిల్, ఆరోగ్య సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత లోపించొద్దు


వంట మహిళలతో మాట్లాడుతున్న ఎంఈఓ

తిమ్మాజిపేట: భోజనంలో నాణ్యత లోపించొద్దని నిర్వాహకులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని మండల విద్యాధికారి సత్యనారాయణశెట్టి సోమవారం సందర్శించారు. వసతిగృహంలో నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటగదులను పరిశీలించారు. వంట ఏజెన్సీ మహిళలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అంతకుముందు ఎమ్మార్సీ కేంద్రంలో పదో తరగతి పరీక్షలకు సంబంధించిన పలు అంశాలను ఆయా పాఠశాలలో హెచ్‌ఎంలతో చర్చించారు. ప్రత్యేకాధికారి సుజాత, ఉపాధ్యాయలు ఉన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా


వినతిపత్రం ఇస్తున్న ఆశావర్కర్లు

పెంట్లవెల్లి: పెండింగ్‌లో ఉన్న డబ్బులను వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ మాట్లాడుతూ లెప్రసీ, పల్స్‌పోలియోకు సంబంధించిన డబ్బులు ఇవ్వలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశావర్కర్లతో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైన వారి పనికి తగినట్లుగా పారితోషికం ఇవ్వాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డా రోహిత్‌కు అందజేశారు. కార్యక్రమంలో శ్రీదేవి, శివలీల, వెంకటమ్మ, సునీత, జ్యోతి, పుష్పలత తదితర ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరంలో ఎమ్మెల్యే పూజలు



అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తరముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో సోమవారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్వర్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. గణపతిపూజ, శివుడికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దేవాలయ సిబ్బందికి, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ సర్వే 99 శాతం పూర్తి



తాడూరు: సమగ్ర కుటుంబ సర్వే 99 శాతం పూర్తి అయినట్లు ఎంపీడీఓ బ్రహ్మాచారి తెలిపారు. మండల కేంద్రంలో ఆన్‌లైన్ సర్వే నమోదును సోమవారం ఆయన పరిశీలించారు. ఆపరేటర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ 24 గ్రామ పంచాయతీలకు గాను 11 వేల 48 ఇండ్లను గుర్తించామన్నారు. 9 వేల 689 ఇండ్లలో సర్వే పూర్తి చేశామన్నారు. 90 శాతం డేటా ఎంట్రీ పూర్తి అయ్యిందన్నారు. సర్వే చేసిన ఫారాలను గ్రామాల వారిగా భద్రపరిచామని వివరించారు.

అటవీ సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ


మాట్లాడుతున్న రేంజర్ చంద్రశేఖర్

కొల్లాపూర్: అటవీ సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటునట్లు ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణ అంశాలపై ఫారెస్టు సిబ్బందికి సోమవారం పట్టణంలోని టింబర్‌డిపో ఎదుట అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల్లోకి ఇతరులు ప్రవేశించకుండా చూడాలన్నారు. అడవిలో ఉచ్చులు, ఉరులు అమర్చడం, విద్యుత్ కంచెలు ఏర్పాటుచేయడం చట్ట విరుద్ధమన్నారు. సమావేశంలో అటవీ సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, వాచర్లు పాల్గొన్నారు.

గైరాన్ భూములను ధరణిలో నమోదు చేయాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వం గైరాన్ భూములను ధరణిలో నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో దళితులకు బడుగుబలహీన వర్గాలకు గైరాన్ భూములు పట్టాలు పంపిణీ చేశారని పేర్కొన్నారు. ఇప్పటికి కొంతమందికి ధరణిలో నమోదు కాలేదని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఎక్కించే విధంగా చొరవ తీసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు మన్యం, రాములు, కృష్ణ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని..

అమ్రాబాద్: ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ పదర మండలం కండ్లకుంట గ్రామస్తులు మాజీ జెడ్పీటీసీ రాంబాబునాయక్ తో కలిసి సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ బదావత్ సంతోష్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. 2022లో గత ప్రభుత్వం కండ్లకుంటకు 40 డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేయడంతో పాటు రాయలగండితాండా సమీపంలో నక్కల గుట్ట వద్ద ఇంటి స్థలాలు ఇచ్చారని తెలిపారు. కొన్ని కారణాల వల్ల ఇళ్లు నిర్మించుకోలేక పోయామని మాకు కేటాయించిన ఇంటి స్థలాలు మాకు కేటాయించాలని కోరారు.

ఎంపీ మల్లురవి ద్వంద్వ వైఖరి వీడాలి

కొల్లాపూర్ రూరల్: ఎస్సీ వర్గీకరణలో ఎంపీ మల్లురవి ద్వంద్వ వైఖరి అవలంభిస్తున్నారని దళిత దండు రాష్ట్ర అధ్యక్షుడు బచ్చలకూర బాల్‌రాజు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రామాపురంలో దళిత దండు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో నిర్వహించిన మాలల సింహగర్జన సభలో ఎంపీ మల్లురవి హాజరుకావడం సరికాదన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా ఎంపీ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమలో నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై ‘చలో కలెక్టరేట్’

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి సోమవారం గ్రామం నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ప్రజాతంత్ర ఉద్యమ నాయకుడు వెంకటయ్య, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు భగత్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఆది, డీవైఎఫ్‌ఐ జిల్లా కోకన్వీనర్ మహేష్ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు సరిపడా గదులు లేకపోవడం, తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు ఒకే దగ్గర బోధన చేస్తుండటంతో ఇబ్బందిగా ఉందన్నారు. గతంలో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణం నాణ్యతగా లేకపోవడంతో పనులు నిలిపివేశారు. ఆయా అదనపు గదుల నిర్మాణాన్ని నాణ్యతతో నిర్మించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలన్నారు. పాదయాత్ర జిల్లా కలెక్టరేట్‌కు చేరుకొని అక్కడ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కుమార్, వెంకటేష్, భరత్, డీవైఎఫ్‌ఐ నాయకులు కమలాకర్, భాస్కర్‌గౌడు, ఖాజా, మహేష్, ప్రసాద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 26.95 కోట్లు రుణమాఫీ

ఉప్పునుంతల: మండలంలో ఇప్పటివరకు నాలుగు విడతలలో 3635 మంది రైతులకు సంబంధించిన రూ. 26.95 కోట్ల రుణమాఫీ అయ్యిందని మండల వ్యవసాయాధికారి కొర్ర రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాల్గో విడతలో 647 మంది రైతులకు రూ. 5.68 కోట్లు రుణమాఫీ మంజూరు అయ్యినట్లు పేర్కొన్నారు.

ప్రమాదకరంగా మలుపులు

ఉప్పునుంతల: మండలంలో పలు రోడ్ల మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. ఉప్పునుంతల- అచ్చంపేట ప్రధాన రహదారి మలుపు పూర్తిగా ప్రమాదకరంగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు, గడ్డి కమ్ముకోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు ఏమాత్రం కన్పించకపోవడంతో ప్రమాదాలు తృటిలో తప్పిపోతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రోడ్డు విస్తరణ సమయంలో రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను మార్పు చేయకుండ అలాగే వదిలేశారని వాహనదారులు వాపోయారు. నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డుపై ప్రయాణం చేస్తున్నా పట్టించుకోవడం లేదని వమిర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా శుభ్రం చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.


బీటీ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన గడ్డి

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

లింగాల: ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అభినవ వీరమణికంఠ ఆలయంలో సోమవారం అయ్యప్పస్వాముల ఇరుముడిని కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. 9 మంది అయ్యప్పమాలధారులు ఇరుమడి కట్టుకున్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాగ్యాబాయి, శంకర్‌రాథోడ్ దంపతులు స్వాములు, భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. రాష్ట్ర నాయకులు రంగినేని శ్రీనివాసరావు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

కార్తీక మాసం ముగింపు వేడుకలు

మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి, రామాలయంలో సోమవారం కార్తీక మాసం ముగింపును నిర్వహించారు. నెల రోజుల పాటు ఆలయాలలో ఆకు పూజలు, అభిషేకాలు, దీపారాధనలు కొనసాగాయి. ఆదివారం రాత్రి ఆంజనేయ స్వామి ఆలయంలో అఖండ భజనలు నిర్వహించారు. దాత న్యాయవాది రామ్మోహన్‌రావు దంపతులు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

అచ్చంపేట: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం అచ్చంపేట ఎన్టీఆర్ మినీస్టేడియంలో సీవీకే ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, కౌన్సిలర్ గౌరిశంకర్, ఎ.గోపాల్ రెడ్డి, కటకం రఘురాం తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

లింగాల: మండల కేంద్రానికి చెందిన మారుతి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బాధితుడికి సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు బాధిత కుటుంబానికి సోమవారం ఎల్‌ఓసీని ఎమ్మెల్యే వంశీకృష్ణ అందజేశారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు


పూజలు చేస్తున్న భక్తులు

తాడూరు: మండల కేంద్రంలో కార్తీకమాసం చివరిరోజు సోమవారం సందర్భంగా చెన్నకేశవ ఆలయం, ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో పూజారి రుద్రకంటి పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో సామూహిక వ్రతాలు, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తాంజనేయస్వామి, చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణలో ఇంద్రకంటి సుజాత, వెంకటేశ్వరశర్మ దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. అభిషేకం, హోమం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వీరాచారి, యార కృష్ణయ్య, మహిళలు పాల్గొన్నారు.

‘అగ్నిపథ్’ యువకులకు అవగాహన

పెద్దకొత్తపల్లి: అగ్నపథ్‌కు ఎంపికైన యువకులకు సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జూపల్లి అరుణ్‌రావు మాట్లాడుతూ అగ్నిపథ్ కోసం ఎంపికైన యువకులు విధి నిర్వహణలో క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. అనంతరం గ్రామంలో యువకులతో కలిసి రన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు దండునర్సింహ, డబ్బ ఎల్లయ్య, రామస్వామి, వివిధ గ్రామాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటా

వంగూరు: రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తానని మార్కెట్ వైస్ చైర్మన్ పండిత్‌రావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సహకారంతో కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్‌గా నియామకం అయినట్లు పేర్కొన్నారు. ఈనెల 4వ తేదీన కల్వకుర్తిలో ప్రమాణస్వీకారం చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

కాల్వకు మరమ్మతు



చారకొండ: మండల కేంద్రంలోని చెరువు కింద ఉన్న కాల్వకు పొలాల రైతులు సోమవారం మరమ్మతులు చేపట్టారు. కేఎల్‌ఐ కాల్వనీరు జూపల్లి, తిమ్మాయిపల్లి చెరువులు నిండి చారకొండ చెరువులోకి నీరు రావడంతో రైతులు స్వచ్ఛందంగా పూడికతీత కాల్వ పనులు చేశారు. 250 ఎకరాలు ఆరుతడి పంటల సాగు చేయవచ్చని రైతులు తెలిపారు. నాయకులు వెంకట్ గౌడ్, బాల్‌రాం గౌడ్, లక్ష్మణ్, అంజయ్య, గౌతమ్, రైతులు తదితరులు ఉన్నారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి వితరణ



బల్మూర్: మండలంలోని కొండనాగుల ఉన్నత పాఠశాలకు క్లాస్‌మెట్ క్లబ్ వ్యవస్థాపకుడు వాస రాఘవేందర్ సతీమణి లక్ష్మి జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం క్రీడా సామగ్రి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ విష్ణుమూర్తి వారిని అభినందించారు. కార్యక్రమంలో క్లాస్‌మెట్ క్లబ్ జిల్లా కార్యదర్శి బంధం పరమేశ్వర్, ప్రతినిధులు గణేష్, శ్రీనివాస్‌రెడ్డి, కవిత, రామోజీ, యాదవరెడ్డి ఉపాధ్యాయులు వీరబ్రహ్మం, నిర్మల, చంద్రకళ, సుంధరయ్య, పీడీ మణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓర్వలేకనే మందకృష్ణ మాదిగ విమర్శలు

మన్ననూర్: మాలల సింహగర్జన బహిరంగ సభ విజయవంతం కావడంతో ఓర్వలేకనే మందకృష్ణ మాదిగ విమర్శలు చేస్తున్నారని మాల మహానాడు రాష్ట్ర నాయకుడు కుంద మల్లికార్జున్ అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. మాలలను ఏకతాటిపైకి తీసుకొస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. దళితులు ఐక్యంగా ఉండేందుకు మాలలు పోరాడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా మందకృష్ణ మాదిగ విమర్శలు చేసేముందు ఒక్కసారి ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి

తెలకపల్లి: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో సోమవారం అయ్యప్పస్వాముల ఇరుముడిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజారులు శ్రీకాంత్‌శర్మ, గురుస్వాముల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి శబరిమలకు బయలుదేరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, అయ్యప్పస్వాములు, హనుమాన్ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



బల్మూర్: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయ తొమ్మిదవ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని ముస్తాబు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శంతన్‌కుమార్‌రెడ్డి, కమిటీ సభ్యులు మిర్యాల రాము, వేముల సుధాకర్, బలుస శ్రీనువాసులు, కేశవరావు, మాజీ సర్పంచ్ శివశంకర్, రవీందర్‌రెడ్డి, మనోహర్, భక్తులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు తొలగించాలి

అమ్రాబాద్: మండల కేంద్రంలోని కోదండ రామాలయం భూమిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం స్థానిక పంచాయతీ కార్యదర్శి మల్లేష్‌కి వినతిపత్రం అందజేశారు. గత నెల 7వ తేదీన రామాలయం భూమి హద్దులు ఏర్పాటు చేశారని తెలిపారు. కమిటీ సభ్యులు శ్రీకాంత్‌గౌడ్, నాగరాజు, రాజు తదితరులు ఉన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును మాలలు గౌరవించాలి

తిమ్మాజిపేట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మాలలు గౌరవించాలని దళిత సంఘం నాయకులు కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఆ సంఘం జిల్లా నాయకులు ప్రదీప్, స్వామి, దేవస్వామి, వెంకటయ్యలు విలేకరులతో మాట్లాడారు. మందకృష్ణ నాయకత్వంలో 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం కారణంగా ఎస్సీ వర్గీకరణసాధ్యమైందన్నారు. వర్గీకరణపై మాలలు ఒక్కసారి పునరాలోచించాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్రీరాం వెంకటేష్, రాజు, శేఖర్, వెంకటస్వామి, రమాకాంత్, నాగరాజులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలుశిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం: డ్రంకన్ డ్రైవ్‌లో వ్యక్తికి జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తు న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ సోమవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం నెల్లికొండ గ్రామానికి చెందిన రాములు గత నెల 30న మద్యం తాగి వాహనం నడుపుతూ డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో పట్టుబడ్డాడు. రాములును స్థానిక కోర్టులో హాజరుపర్చగా సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ రూ. 2 వేల జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

బాలిక అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: బాలిక అదృశ్యమైన ఘటనలో సోమవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుడిపల్లి గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఈ నెల 1న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. ఎంత వెతికినా ఆచూకీ తెలువకపోవడంతో సోమవారం బాధిత కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.